క్లుప్తంగా

ఆసరా సభ ఏర్పాట్ల పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: ఈనెల 4న గర్భాం గ్రామ సమీపంలోని పెట్రోల్‌బంక్ వెనుక ఉన్న స్థలంలో 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సభా స్థలాన్ని, ఏర్పాట్లును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. పార్కింగ్, భోజన ఏర్పాట్లపై స్థానిక నాయకులతో చర్చించారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి. రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

ఎంఈఓకు సత్కారం



ఎంఈఓ రామారావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు అందించిన సేవలే మంచి గుర్తింపునిస్తాయని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఉత్తమ ఎంఈఓగా జిల్లాస్థాయిలో అవార్డు అందుకున్న గరివిడి మండల ఎంఈఓ పి.రామారావును స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. గరివిడి మండలానికి చెందిన ఎంఈఓకి జిల్లాస్థాయి అవార్డు రావడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల కసరత్తుపై సమీక్ష



తహసీల్దార్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఈఆర్ఓ మురళీకృష్ణ

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఈఆర్ఓ పి.మురళీకృష్ణ తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌లు, రూట్‌లు, విద్యుత్, తాగునీరు, ర్యాంప్‌లు వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. మండలాల వారీగా ఓటర్ల సంఖ్య, బూత్‌ల్లో ఉన్న ఓటర్ల సంఖ్య, ఓటర్ల జాబితాలు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు డి.శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, రాంబాయి, చంద్రశేఖర్, ఎలక్షన్ డీటీ నారాయణమ్మ, తదితరులు హాజరయ్యారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట: మండల కేంద్రం ఎస్.కోటలో మండల పరిషత్, పంచాయతీ నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ రఘురాజు శుక్రవారం భూమిపూజ చేశారు. పుణ్యగిరి రోడ్డులో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ డ్రైన్లు, మండల పరిషత్ నిధులతో స్థానిక గాంధీ పార్కులో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి, ఎంపీటీసీ ధారగిరి, స్థానిక వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న కొండలరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మధుకుమారి

దత్తిరాజేరు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి పింఛన్ డబ్బులు అందిస్తున్నారు. వంగర గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారు కిల్లాడ కొండలరావు అనారోగ్యంతో విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్ మధుకుమారి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.

మహిళల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన నాయకుడు
- వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు సముచిత స్థానం
- 'వైఎస్సార్ ఆసరా' సంబరాల్లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



కోలాటం ఆడుతూ సంబరాలు చేసుకుంటున్న మహిళలు



డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ రఘురాజు



ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు

జామి: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని కుమరాంలో శుక్రవారం నిర్వహించిన 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంశక్తి సంఘాల లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు స్వయంశక్తి సంఘాల మహిళలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 2019 ఏప్రిల్ నాటికి సంఘాలకు ఉన్న అప్పును నాలుగు విడతల్లో చెల్లించడం జరిగిందన్నారు. 5,915 సంఘాలకు రూ.154.76 కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. నవరత్న పథకాల అమలులో ప్రభుత్వం మహిళలకే అధిక ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమం పథకాల నగదును నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తోందన్నారు. మహిళలు, పేదలే వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లుగా పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి చేయకుండా మోసం చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికలు సమీపించడంతో ప్రతిపక్ష నేతలు మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు.

మహిళలకు గౌరవం

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయంలోనే మహిళలకు ఎంతో గౌరవం, స్వేచ్ఛ లభించాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మహిళలకు ఇచ్చిన ప్రతి రూపాయి సద్వినియోగపడతాయని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. వసతి దీవెన, విద్యా దీవెతన, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాలకే జమచేయడం జరుగుతోందన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా, అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, జిల్లా ప్రచారక్ విభాగం అధ్యక్షుడు గుడివాడ రాజేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు పిన్నింటి రవికుమార్, వైస్ ఎంపీపీలు ఎన్నింటి విజయలక్ష్మి, గేదెల వెంకటరావు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ పిన్నింటి ఆదిలక్ష్మి, కంది పద్మావతి, కిలారి సూర్యారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తోట మధుసూదనరావు, ఎంపీడీఓ తిరుమలరావు, తహసీల్దార్ రాంబాయి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఆదయ్య, ఏపీఎం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాకు రూ.1.60 లక్షల లబ్ధి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని మా కుటుంబానికి లక్ష 60 వేల రూపాయలు లబ్ధిచేకూరింది. ఒక్క వైఎస్సార్ ఆసారా ద్వార నాలుగు విడతల్లో రూ.44 వేలు అందుకున్నాను. రైతుభరోసా, మా పిల్లలకు విద్యాదీవెన, వసతి దీవెన అందాయి. ఏ ప్రభుత్వంలో కూడా మాకు ఇంత లబ్ధి జరగలేదు.

– రొక్కం గోవిందమ్మ, ఎ.ఆర్.పేట, జామి మండలం

రూ.2.45 లక్షలు జమయ్యాయి



వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో మా సంఘానికి రూ.2.45 లక్షలు జమ అయ్యాయి. మహిళలకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. నాకు ఆసరా కాకుండా అమ్మ ఒడి, రైతు భరోసా కూడ అందాయి.

– చుక్క పైడిరాజు, ఎ.ఆర్.పేట

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మహిళల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు ఎంతో రుణపడి ఉంటారు. ఆసరా పథకం ద్వారా మా గ్రూప్‌కు రూ.4లక్షల 96 వేలు నాలుగు విడతల్లో అందింది. మా గుండెల్లో సీఎం జగన్ గూడుకట్టుకుని ఉంటారు.

– సింగిడి సత్యవతి, అట్టాడ, జామి మండలం.

మహిళలకు అండగా ప్రభుత్వం



సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అండగా నిలిచారు. మహిళలకు సముచిత స్థానం కల్పించారు. వైఎస్సార్ ఆసరా కింద మా సంఘానికి నాలుగు విడతల్లో రూ.3.20 లక్షలు జమ అయింది. సున్నా వడ్డీ రాయితీ వర్తించింది. మాకు ఇతర పథకాలతో పాటు మా పిల్లలకు అమ్మ ఒడి కూడా అందుతోంది.

– యడ్ల గంగమ్మ, వెన్నె గ్రామం, జామి మండలం

ఆసరా సంబరాలను విజయవంతం చేయండి

బొండపల్లి: ఈ నెల 4న మండల కేంద్రంలోని భూవి లేఅవుట్‌లో నిర్వహించే వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను విజయవంతం చేయాలని గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ పిలుపునిచ్చారు. గొట్లాం గ్రామ సచివాలయంలో శుక్రవారం వలంటీర్లు, బుక్ కీపర్లతో సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగ విడతల్లో డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేయడం జరిగిందన్నారు. ఆసరా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ మండల రామునాయుడు, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ ఉన్నారు.

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, ఏపీఎం ఎల్.పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు, వైఎస్సార్‌సీ కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏపీయూఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తవలస: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) కొత్తవలస మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగినట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వి.జె. సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని డాబాల ప్రాథమిక పాఠశాలలో ఈ ఎన్నికలను నిర్వహించారు. మండల శాఖ గౌరవ అధ్యక్షులుగా వి.నక్షత్రరావు, అధ్యక్షుడిగా ఐ.వి.ఎస్.ఎన్.ఆచార్యులు, ప్రధాన కార్యదర్శిగా ఎం.రమణ, మహిళా ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.సత్యవాణి, ఆర్థిక కార్యదర్శిగా ఆర్.సింహాచలం, మిగతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొవ్వాడ శ్రీనివాసరావు పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో పులువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓలు

గజపతినగరం: మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గజపతినగరం, బొండపల్లి, మెంటాడ, దత్తిరాజేరు, గంట్యాడ మండలాలకు చెందిన గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) అనుకరణ అనే అంశంపై మూడు రోజుల పాటు ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ) ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడ తెలుసుకున్న అంశాలను బోధనలో అన్వయించుకుని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్పీలు రమేష్ చంద్ర, వీరాస్వామి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు

గజపతినగరం: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ పనులు పూర్తవడంతో వేతనదారులంతా ఉపాధి పనులకు వెళ్తున్నారు. చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తున్నారు. మండలంలో ప్రస్తుతం 3,400 మందికి వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఎంఈఓ పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల వర్కుబుక్స్, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కాసేవు వారికి గణితం బోధించారు. అనంతరం పాఠశాల రికార్డులు, టీచింగ్ డైరీలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాలు పెట్టాలని సూచించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సీఆర్పీలు లక్ష్మి, కోటి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రూ.1.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



డ్రేనేజీ నిర్మాణ పనులు

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం ఎస్సీ కాలనీలో ఉపాధిహామీ నిధులు రూ.1.50 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ జేఈ అప్పలనాయుడు తెలిపారు. పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎం.వెంకటాపురం గ్రామంతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికే సీసీరోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

వైభవంగా పరదేశిమాంబ తీర్థం



కొత్తవలస: బంగారమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు



వేపాడ: పూజలందుకుంటున్న పరదేశిమాంబ

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట గ్రామదేవత పరదేశిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బక్కునాయుడుపేట, కొత్తూరు, రాయుడుపేట, వీలుపర్తి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా పైడితల్లిమ్మ తీర్థం

కొత్తవలస: మండలంలోని కొత్తూరు గ్రామంలో కొలువైన బంగారమ్మ తల్లి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన మహిళ ఖోఖో జట్టు

గుర్ల: 'ఆడుదాం ఆంధ్రా' జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో కెల్ల సచివాలయానికి చెందిన మహిళల ఖోఖో జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి జట్లపై గెలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. విజేతలను స్థానిక నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, సర్పంచ్ కెల్ల లక్ష్మి, వైస్ సర్పంచ్ కెల్ల సురేష్ అభినందించారు.

మహిళల క్రికెట్‌లో షికారుగంజి క్రీడాకారుల సత్తా..



జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన షికారుగంజి క్రికెట్ టీం

దత్తిరాజేరు: 'ఆడుదాం ఆంధ్రా' జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో షికారుగంజి మోడల్ స్కూల్‌కు చెందిన మహిళల క్రికెట్ జట్టు విజేతగా నిలిచిందని ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి శుక్రవారం తెలిపారు. క్రీడాకారులను ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఎంఈఓలు ఎం.వెంకటరావు, సుధాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

సెమీస్‌కు చేరిన మరుపల్లి జట్లు

గజపతినగరం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో జరుగుతున్న జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో గజపతినగరం నియోజకవర్గం జట్లు సత్తా చాటినట్లు నియోజకవర్గ వ్యాయామోపాధ్యాయుల ఇన్‌చార్జ్ చింత సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం జరిగిన పురుషులు, మహిళల ఖోఖో సెమీఫైనల్స్ పోటీల్లో మరుపల్లి సచివాలయానికి చెందిన జట్లు విజేతలుగా నిలిచి ఫైనల్స్‌కు చేరాయి. శనివారం జరిగే ఫైనల్స్‌లో చీపురుపల్లి నియోజకవర్గ జట్లతో తలపడనున్నాయి.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం



బొండపల్లి: రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, వైద్య సిబ్బంది



లక్కవరపుకోట: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ఎస్.కోట: రోగులకు హెల్త్‌ఫైల్ అందిస్తున్న ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి

బొండపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలుచేస్తోందని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండలంలోని నెలివాడ గ్రామంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు రోగులకు మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు తాళ్లపూడి అప్పలనాయుడు, బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

146 మందికి వైద్య పరీక్షలు

లక్కవరపుకోట: మండలంలోని ఖాసాపేట గ్రామంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 146 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. కంటి ఆపరేషన్లకు నలుగురిని ఎంపిక చేసి పెద్దాస్పత్రికి రిఫర్ చేసినట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయుకులు కోళ్ల కృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలో పెదఖండేపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ సొండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, సర్పంచ్ యాళ్ల రమణ, ఎంపీటీసీ బి.దేముడు, తదితరులు వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.

బాధ్యతల స్వీకరణ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ మండలాలకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. లక్కవరపుకోట మండల తహసీల్దార్‌గా దేవుపల్లి ప్రసాదరావు, కొత్తవలస తహసీల్దార్‌గా సీహెచ్ చంద్రశేఖర్, గుర్ల మండల తహసీల్దార్‌గా పి.రమాదేవి, దత్తిరాజేరు మండల తహసీల్దార్‌గా సుదర్శనరావు, బొండపల్లి మండల తహసీల్దార్‌గా ఎస్.రమణయ్య, జామి మండలం తహసీల్దార్‌గా జి.రాంబాయి, గజపతినగరం మండల తహసీల్దార్‌గా సీహెచ్‌వీ రమేష్, మెరకముడిదాం మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా ఎం.పావని బాధ్యతలు చేపట్టారు. వారికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

– సాక్షి నెట్‌వర్క్



ప్రసాదరావు, తహసీల్దార్, ఎల్.కోట



చంద్రశేఖర్, తహసీల్దార్, కొత్తవలస



ఎం.పావని, ఎంపీడీఓ, మెరకముడిదాం




రమేష్, తహసీల్దార్, గజపతినగరం



రాంబయి, తహసీల్దార్, జామి



సుదర్శనరావు, తహసీల్దార్, దత్తిరాజేరు



రమణయ్య, తహసీల్దార్, బొండపల్లి